క్లుప్తంగా

రేపు తెనాలిలో కేంద్రమంత్రి పర్యటన

తెనాలిఅర్బన్:కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం తెనాలిలో పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో, మధ్యాహ్నం 12 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో జరిగే సమీక్షల్లో పాల్గొంటారని చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొనున్నట్లు వివరించారు.

శని, ఆదివారాల్లో బస్సుపాస్‌లు నిలిపివేత

తెనాలిఅర్బన్: సాఫ్ట్‌వేర్ ఆధునీకరణలో భాగంగా శని, ఆదివారాల్లో తెనాలిఆర్టీసీ డిపోలో జారీ చేసే బస్సుపాస్‌లను నిలిపివేస్తున్నట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ నుంచి యధావిధిగా కౌంటర్‌లో బస్సుపాస్‌లను ఇస్తారని చెప్పారు. ప్రయాణీకులు, విద్యార్థులు, సీజన్ పాస్‌లు తీసుకునే వారు సహకరించాలని కోరారు.

నేపాల్ క్రికెట్‌లో రాణించిన విద్యార్థులకు అభినందన



తెనాలిరూరల్: నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ అండర్-12 టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో రాణించిన విద్యార్థులను అభినందించారు. గత నెలలో నేపాల్‌లో అండర్-12 టీ-20 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రి పాఠశాల ఎనిమిదో తరగతి చదువుతున్న ఎస్.ప్రణవ్, ఐదో తరగతి చదువుతున్న నిహాల్ భారత దేశం తరఫున పాల్గొన్న జట్టులో చోటు సంపాదించడమే కాకుండా జట్టు కెప్టెన్, వైస్ కెప్టెన్ బాధ్యతలు నిర్వర్తించి, ఫైనల్‌లో తమ జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపల్ టీవీ సుబ్రహ్మణ్యం, ఏవో జ్యోతి అభినందించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం



తెనాలిఅర్బన్: వరద బాధితులను ఆదుకునేందుకు తెనాలికి చెందిన వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య నాయకులు రూ.లక్ష నగదును విరాళంగా ప్రకటించారు. వెలగపూడిలోని సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ మూర్తి, ఉపాధ్యక్షులు కుందేటి వెంకట సుబ్రమణ్యం, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య, పాల్గొన్నారు.

కొత్తగా గ్రామాల్లో ఉపాధి పనులు గుర్తించాలి

అప్పాపురం(కాకుమాను): గ్రామంలో చేపట్టాల్సిన పనులను గుర్తించాలని ఎంపీడీఓ కె.యుగకీర్తి అన్నారు. మండలంలోని అప్పాపురంలో గురువారం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌లు రైతులు, ప్రజా ప్రతినిధులను సంప్రదించి గ్రామంలో చేపట్టాల్సిన పనులను గుర్తించాలని సూచించారు. జాబ్ కార్డు ఉన్న వారికి పని దినాలు పెంచడంతో పాటు కార్డులు లేని వారిని గుర్తించి వారికి కొత్త కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి

గుంటూరు రూరల్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకుని ఏకాగ్రతతో కృషిచేసి ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ పీబీ జయలక్ష్మి తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మానసిక ఒత్తిడి అధిక మించే విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, బేసిక్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ ఎ.రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెదకాకాని: ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజి అన్నారు. మండలంలోని నంబూరు జెండా చెట్టు వద్ద సీఐటీయూయ ఆధ్వర్యంలో గురువారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. కార్యక్షకమంలో నాయకులు నాయకులు మన్నెం శ్రీనివాసరావు, జొన్నల అప్పిరెడ్డి, ఎ.వెంకటరెడ్డి, సుభాని, మాబు పాల్గొన్నారు.



కొల్లిపరలో శ్రీబాలత్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



మారీసుపేటలో శ్రీబాలత్రిపుర సుందరీ దేవి అలంకారం



శ్రీబాలత్రిపుర సుందరీ దేవిగా శ్రీవాసవీ అమ్మవారు



దేవీచౌక్‌లో శ్రీరాజరాజేశ్వరిదేవిగా..



రామస్వామిపేటలో శ్రీఆదిలక్ష్మీ దేవిగా ..



నందివెలుగులో గాయత్రిమాతగా దర్శనమిచ్చిన అమ్మవారు

ఫిర్యాదులు రాకుండా చూడండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మురుగు కాల్వలను బాగు చేయిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 5,13,26 వార్డులలో గురువారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని రోడ్లు, మురుగు కాల్వలను శుభ్రం చేశారు. అలాగే బ్లీచింగ్, స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ ఇస్మాయేల్, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ఇసుక కొరతపై తెనాలిలో సీఐటీయూ ధర్నా



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నేత కేబీ ప్రసాద్

తెనాలి: ఇసుక కొరతపై ప్రభుత్వం దృష్టిని సారించి అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతూ శుక్రవారం ఉదయం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు కేబీ ప్రసాద్ కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్‌లో గురువారం ఆయన భవన నిర్మాణ కార్మికుల నుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేనందు వల్లనే ఇసుకకు కొరత ఏర్పడి వందలాది మంది అసంఘటిత కార్మికులు పని లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తెనాలి, పరిసర గ్రామాల్నుంచి ఛార్జీలు పెట్టుకుని తెనాలి వస్తున్న కార్మికులు, మహిళా కార్మికులు పనుల్లేకపోవటంతో తిరిగి వెళుతున్నారని చెప్పారు. మరోవైపు అన్నిరకాల నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూ, కార్మిక కుటుంబాలు వీధిన పడే పరిస్థితి దాపురించిందని చెప్పారు. సంఘ నాయకులు షేక్ ఫకీర్ అహ్మద్, ఆర్.శ్రీనివాసరావు, జి.గోపాలం, షేక్ జానిమేస్త్రీ, షేక్ కరిముల్లా, బి.కృష్ణయ్య, ఎంఎస్ నాని, టి.నగేష్‌బాబు, ఎం.శివ రామకృష్ణ, కె.రాంబాబు పాల్గొన్నారు. సంఘ గౌరవాధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలి అధ్యక్షత వహించారు.

మురళీ కృష్ణకు కడప దర్గా పీఠాధిపతి ఆశీస్సులు



కడప దర్గా పీఠాధిపతి



కార్యక్రమంలో పాల్గొన్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: కడప అమీర్‌న్ పీర్ దర్గా పీఠాధిపతి శ్రీ హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుస్సేనీ సాహెబ్‌ను వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ దర్శించుకుని ఆశీస్సులు పొందారు. గురువారం పట్టణంలోని అంజుమన్ షాదీ ఖానాకు విచ్చేసిన కడప దర్గా పీఠాధిపతిని పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ సాహెబ్ వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ నాజర్, టెంట్ హౌస్ మునీర్, మొల్ల కరీం, షేక్ జానీ, సాహెబ్ వారి శిష్య బందం పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో 30ఎమ్ జీనోమిక్స్ సెంటర్ ప్రారంభం



30 ఎం జీనోమిక్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ నాగభూషణ్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో హైదరాబాద్‌లోని 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీ తన సెంటర్‌ను గురువారం ప్రారంభించిందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ తెలిపారు. వైస్ చాన్సలర్ 'మినీ డీఎన్‌ఏ ల్యాబ్' సెంటర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచ మానవాళిలో ఎవరైనా ఒకే రోగంతో బాధపడుతున్న వివిధ రకాల వ్యక్తులకు ఒకేరకమైన వైద్యం సరిపోదని, వారి డీఎన్‌ఏల ఆధారంగా పర్సనలైజ్డ్ వైద్యం అవసరమన్నారు. అందుకనుగుణంగా 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీ పర్సనలైజ్డ్ మెడిసిన్‌లో భాగంగా ఫార్మకోజెనిటిక్స్ అప్రోచ్ ద్వారా ఔషధానికి సంబంధించిన డోస్‌లను ముందుగానే గుర్తించడం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో బట్టతలకు గురయ్యే అవకాశం ఉందో వారిని కూడా గుర్తించవచ్చునన్నారు. ఈ కార్డియక్ స్క్రీనింగ్ టెస్ట్, బట్టతల టెస్ట్‌ను కేవలం రూ.499లకే నిర్వహించి 24 గంటల్లోనే రిపోర్ట్ ఇస్తారని వెల్లడించారు. 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బెన్నెట్ బాస్కోదాస్, రిజిస్ట్రార్ రఘునాథన్ పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ పంట నష్టపరిహారం అందించాలి



చేబ్రోలు తహసీల్దార్ శ్రీనివాసశర్మకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

చేబ్రోలు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలలో పంట దెబ్బతిని, నష్టపోయిన రైతులు, కౌలు రైతులందరికీ పంట నష్టపరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు డిమండ్ చేశారు. చేబ్రోలు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెంలో అర్హులైన రైతులకు పంట నష్టపరిహారం అందజేయలేదని, వారిని ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘం నాయకులు, రైతులు మండల తహసీల్దారు కె.శ్రీనివాసశర్మ, ఏఓ బి.శ్రీనివాసనాయక్‌లకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హులైన సాగుదారులైన కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని చెబుతున్నా ఆచరణలో అమలు జరగటం లేదన్నారు. పంట నష్టపరిహారం అందకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పానరు. వీరనాయకునిపాలెం గ్రామంలో అర్హులైన రైతులకు పంట నష్టపరిహారం అందించటంతో తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. తహసీల్దారు శ్రీనివాసశర్మ మాట్లాడుతూ పంట నష్టపరిహారంపై గ్రామస్తులు చేసిన ఫిర్యాదులపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామన్నారు. వీరనాయకునిపాలెం గ్రామానికి చెందిన రైతులు యర్రాకుల వీరాంజనేయ రాజు, తోక సుబ్బారావు, ధూళ్ల రత్తయ్య, ఓ.నాగరాజు, కాసుల శివయ్య, రైతు సంఘం నాయకులు షేక్ మస్తానరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

ఎంపీడీఓ కె.శివపార్వతి

ప్రత్తిపాడు: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాలను ప్రగతి పథంలో నడిపిస్తామని ఎంపీడీఓ కె.శివపార్వతి తెలిపారు. మండల పరిధిలోని యనమదలలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై గ్రామసభను నిర్వహించారు. సమావేశానికి సర్పంచి జి.ఆదినారాయణ అధ్యక్షత వహించారు. గ్రామానికి ఏమి అవసరం, ప్రాధాన్య క్రమంలో చేయాల్సిన పనులు తదితరాలపై గ్రామసభలో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల స్వచ్ఛతకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా సమాజం, వ్యక్తిగత పరిశుభ్రత వలన కుటుంబ ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా, ఉపాధిహామీ పథకం ఇన్‌చార్జి ఏపీఓ మస్తాన్‌వలి, స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శివాజీ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

కొల్లిపర: వరి పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు తెలిపారు. మండలంలోని చెముడుబాడు గ్రామంలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు యాజమాన్య పద్ధతులపై ఏవో అవగాహన కల్పించారు. వరి పంట యాజమాన్య పద్ధతులపై సూచనలు , సలహాలు ఇచ్చారు. వరి పంటలో సుదిదోమ, ఎండుతెగులు , పిచికారి చేయాల్సిన మందుల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతుభరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు రెండు దరఖాస్తులు

తెనాలిరూరల్: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో ప్రైవేటు మద్యం దుకాణాల దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన మద్యం పాలసీలో భాగంగా ఎక్సైజ్ అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. తెనాలి టౌన్, తెనాలి మండలం, కొల్లిపర, దుగ్గిరాల మండలాల దుకాణాలకు తెనాలి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. గురువారం రెండు దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తెలిపారు.

ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వృద్ధుడి మృతి

తెనాలిరూరల్: రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెంది పడి ఉండడాన్ని రైల్వే అధికారులు గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతుడి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుందని తెలిపారు. తెలుపు, నీలం, నలుపు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. ఎస్ జి. వెంకటాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చేబ్రోలు: చేబ్రోలులోని అప్పాపురం చానల్‌లో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. చేబ్రోలు గ్రామ సమీపంలోని అప్పాపురం చానల్ టన్నెల్ వద్ద గుర్తు పట్టలేని విధంగా ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎర్ర చేతి చొక్కా, ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. చేబ్రోలు ఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు.

నడింపాలెంలో శ్రమదానం

ప్రత్తిపాడు: మండల పరిధిలోని నడింపాలెం గ్రామ పంచాయతీలో అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం శ్రమదానం నిర్వహించారు. ఇన్‌చార్జి సర్పంచి పాలెపు కుమారి ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం రక్షిత మంచినీటి చెరువు వద్ద జనావాసాల మధ్య పెద్ద ఎత్తున పెరిగిన మొక్కలను ఎంపీడీఓ కె. శివపార్వతి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజాలు సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులతో కలిసి శుభ్రం చేశారు.

రేషన్ బియ్యం లారీ స్వాధీనం

పొన్నూరు: మండలంలోని ఉప్పరపాలెం నుంచి అక్రమంగా తరలి వెళుతున్న రేషన్ బియ్యం లారీని రూరల్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ కిరణ్, తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పీడీఎస్ బియ్యం లారీతో పాటు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కోటేశ్వరరావు కేసు వివరాలు తెలిపారు. స్వాధీనం చేసుకున్న లారీలో 75 బస్తాలు, సుమారు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు తెలిపారు. అక్రమంగా బియ్యం తరలింపులో పొన్నూరుకు చెందిన మురళీకృష్ణ, తాళ్లపాలేనికి చెందిన పోకల శ్రీనివాసరావు, ఉప్పరపాలేనికి చెందిన తాడిశెట్టి నాగేశ్వరరావు ప్రమేయం ఉన్నట్లు తమ విచారణలో తేలిందని వెల్లడించారు. వారిలో లారీ డ్రైవర్ మురళీకృష్ణను అదుపులోకి తీసుకున్నామని మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. ఇకపై రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సీఐ కోటేశ్వరరావు హెచ్చరించారు.

నేడు వెనిగండ్లలో ఉచిత పశు వైద్య శిబిరం

పెదకాకాని: వెనిగండ్లలో శుక్రవారం నిర్వహించనున్న పశు వైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. పెదకాకాని మండలం వెనిగండ్ల కళ్యాణమండపం వద్ద ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

చిప్స్‌లో ముగిసిన స్వచ్ఛతా హి సేవ

గుంటూరు రూరల్: వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా జీవించాలని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. గురువారం చౌడవరంలోని కళాశాలలో స్వచ్ఛతా హి సేవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా తమ కళాశాల విద్యార్థులు సమీప గ్రామాలైన చౌడవరం, దాసరిపాలెం, యనమదల, చుట్టుగుంట తదితర ప్రాంతాల్లో ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం, ప్లాస్టిక్ వినియోగం వల్ల నష్టాలు, రోడ్డు భద్రత, ఆరోగ్యం, డ్రగ్స్ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, తదితర విషయాలను గ్రామాల్లోని ప్రజలకు ర్యాలీలద్వారా అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్.గోపాలకృష్ణ, అదనపు కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్, సంయుక్త కార్యదర్శి చుక్కపల్లి రమేష్ పాల్గొన్నారు.

కౌలురైతుల సమస్యలపై 8న 'ఛలో విజయవాడ'



పంటపొలాల్లో రైతులతో కలిసి కరపత్రం ఆవిష్కరించిన బైరగాని

తెనాలి: కౌలు రైతుల సమస్యల పరిష్కారానికై అక్టోబర్ 8న విజయవాడలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు కోరారు. గురువారం తెనాలిలోని గోలి డొంక పొలాల వద్ద రైతులతో కలసి ఛలో విజయవాడ కరపత్రాన్ని విడుదల చేశారు. ఇటీవల వచ్చిన కృష్ణానది, బుడమేరు వరదలు, అధిక వర్షాలు కారణంగా కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో పంటలన్నీ జలమయ్యాయని, కంద, పసుపు, నిమ్మ, అరటి లాంటి వాణిజ్య పంటలకు రైతులు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టారని తెలిపారు. నష్టపోయిన రైతులకు పెట్టుబడితో పాటు కౌలు అదనంగా చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నీట మునిగిన పంటల నుండి ఒక్క వడ్ల గింజ గాని, దుంపగానీ చేతికొచ్చే పరిస్థితి లేదని శ్రీనివాసరావు చెప్పారు. ఎకరా వరి పంటకు రూ 10. వేలు, వాణిజ్య పంటలకు రూ. 14 వేలు నష్టం నష్టపరిహారం ప్రకటించినప్పటికీ ముఖ్యమంత్రి ప్రకటన వట్టి నీటిబుడగలే అన్నారు. రైతులకు ఇస్తామన్న నష్టపరిహారం పూర్తిస్థాయిలో అమలు జరగకపోవడంతో నష్టపరిహారం అందని కౌలు రైతులతో గ్రామాలవారీగా అర్జీలు తీసుకుని విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రానికి తరలిరావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వీరితో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి, రైతులు పాట్లూరి రామయ్య, తులిమిల్లి నాగేశ్వరరావు, జెట్టి శ్రీను, కల్లూరి శ్రీను, మేకల చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

జనం రోగాలతో అల్లాడుతున్నా పట్టించుకోరా..?

- అనుమతుల్లేని వాటర్ ప్లాంట్లను ఎందుకు ఊరుకుంటున్నారు
- ప్రత్తిపాడు గ్రామసభలో అధికారులపై ప్రశ్నల వర్షం



సభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

ప్రత్తిపాడు: వాటర్ ప్లాంట్లు నీరు కలుషితమని మీ అధికారులే చెబుతున్నారు.. ఆ నీరు తాగితే లివర్లు చెడిపోతాయనీ ప్రకటిస్తున్నారు. మరి అలాంటి ప్లాంట్లు సీజ్ చేయకుండా మీరు ఎందుకు చోద్యం చూస్తున్నారంటూ ప్రత్తిపాడు గ్రామస్తులు పంచాయతీ అధికారులపై గ్రామసభలో మండిపడ్డారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో గురువారం గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో నాయకులు, ప్రజలు గ్రామంలోని తాగునీటి సమస్యపై గళం విప్పారు. మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బాపతు వెంకటరమణ, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ కమ్మా శివప్రసాద్, వార్డు సభ్యులు సల్మాహుస్సేన్, గ్రామస్తులు శ్రీను, గోపి, కోటిరెడ్డి, బాపతు రమణారెడ్డిలతో పాటు పలువురు గ్రామస్తులు పంచాయతీ అధికారులను ఘాటుగా ప్రశ్నించారు. గత కొద్ది రోజులుగా ప్రజలు కలుషిత నీటిని తాగి దద్దుర్లు, దురదలు, జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నారని, ఇంత జరుగుతున్నా కనీసం పంచాయతీ అధికారులకు చీమ కుట్టినట్లయినా ఉండటం లేదని ప్రశ్నించారు. స్పందించిన సెక్రటరీ లక్ష్మీప్రసన్న ప్రత్తిపాడులో ఉన్న వాటర్ ప్లాంట్లులో కేవలం నాలుగు ప్లాంట్లులో నీరు మాత్రమే బాగుందని, మిగిలిన ప్లాంట్లు నీరు తాగడం సురక్షితం కాదని చెప్పారు. దీంతో ప్లాంట్లు ఇంత విచ్చలవిడిగా కలుషిత నీటిని విక్రయిస్తుంటే మీరెందుకు సీజ్ చేయకుండా ఉపేక్షిస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రసాద్ ప్లాంట్లలో నీటిని పరీక్షించామని, ఇప్పటికే వారికి నోటీసులు కూడా జారీ చేశామని తెలిపారు. మరలా ప్లాంట్ల నిర్వాహకులందరికీ హెచ్చరికలు అధికారులు చేస్తున్నారని, తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకునేందుకు వెనుకాడరని చెప్పారు. కుక్కలు, శానిటేషన్ వంటి వాటిని ఎందుకు పట్టించుకోవడం లేదని, అసలు పంచాయతీకి సాధారణ నిధులు ఎంత వస్తున్నాయని ప్రశ్నించడంతో వారి నుంచి స్పష్టమైన సమాధానాలు కరువయ్యాయి.

ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం అంధకారమే

పట్టణ సీఐ అహ్మద్ జానీ



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ అహ్మద్‌జానీ

బాపట్లటౌన్: ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం అంధకారమేనని పట్టణ సీఐ అహ్మద్‌జానీ తెలిపారు. వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే జరిగే పరిణామాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ సీఐ అహ్మద్‌జానీ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ బాగుండాలంటే ర్యాగింగ్ జోలికి వెళ్లకుండా ఉండాలన్నారు. ప్రముఖ అడ్వకేట్ ఆర్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీనియర్లు, జూనియర్లకు గైడ్‌గా ఉండాలన్నారు. జూనియర్లపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన సెక్షన్ల కింద జైలుజీవితాన్ని గడపాల్సి వస్తుందన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.స్మిత్ మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్ కమిటీ ఏర్పాటుచేశామని, కమిటీ ఫోన్ నంబర్లు కాలేజీలు అన్ని చోట్ల డిస్‌ప్లే చేశామన్నారు. కళాశాలలో ఫిర్యాదుల బాక్స్‌లను కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీఎస్ రామిరెడ్డి, డాక్టర్ జి రవిబాబు, డాక్టర్ బి.రాజ్ కిరణ్, డాక్టర్ డి విజయ్ కుమార్, డాక్టర్ కె.కృపావతి, డాక్టర్ కె.లావణ్య పాల్గొన్నారు.